క్లుప్తంగా

జేబీఎన్‌పీ పొన్నూరు అభ్యర్థిగా వరికుంట



పెదకాకాని: జై భారత్ నేషనల్ పార్టీ పొన్నూరు అభ్యర్థిగా వరికుంట రోశయ్య ఖరారయ్యారు. పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ రాష్ట్ర వ్యాప్తంగా 48 మంది ఎమ్మెల్యే అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటించడం జరిగిందని, ఆ జాబితాలో పెదకాకాని గ్రామానికి చెందిన నాపై నమ్మకం ఉంచి పొన్నూరు నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని రోశయ్య వెల్లడించారు.

అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి



నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నామినేషన్ దాఖలు చేయడానికి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సాధారణ ఎన్నికల్లో నేటి నుంచి నామినేషన్ల దాఖలుకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం నగర పాలక సంస్థ పరిధిలోని గుంటూరు తూర్పు (95), పశ్చిమ (94) నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల నుంచి నామినేషన్స్ స్వీకరిస్తామన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి కమిషనర్ చాంబర్‌లో, గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి సిటీ ప్లానర్ చాంబర్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల నుంచి నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్ల ఫారాలు అందించడం, ఫారాల పూర్తికి అవసరమైన సూచనల కోసం హెల్ప్ డెస్కుల ఏర్పాటు జరిగిందని తెలిపారు. నామినేషన్లు స్వీకరించే జీఎంసీ ప్రధాన కార్యాలయం పరిసరాల్లో బారికేడింగ్ ఏర్పాటు చేశామని, నగర పాలక సంస్థ ఉద్యోగులు కూడా గుర్తింపు కార్డులు ధరించి కార్యాలయ విధులకు హాజరు కావాలని ఆదేశించారు.

మతసామరస్యంలోనే ఆనందం ఉంది



గుంటూరు మెడికల్ : మతసామరస్యంలో ఉన్న ఆనందం కంటే మరొకటి ఉండదని గైనకాలజిస్ట్, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్, హోప్ విన్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ షమ సుల్తాన అన్నారు. తండ్రికి ఇచ్చిన మాట కోసం రాజ్యాన్నే త్యజించిన గొప్ప పాలకుడు శ్రీరామచంద్రుడు అని ఆమె కొనియాడారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా బుధవారం గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో పాదాచారులు, వాహనదారులకు డాక్టర్ షమ సుల్తాన మజ్జిగ పంపిణీ చేశారు. దీంతో మండు టెండలో మజ్జిగ ఇచ్చి దాహాన్ని తీర్చిన డాక్టర్ షమ సుల్తానకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ షమ సుల్తాన మాట్లాడుతూ రాముని కాలంలో ధర్మం నాలుగు పాదాలపై నడిచిందని, ఈ నేపథ్యంలో రాముని వంటి రాజు కోసం, రామరాజ్యం నాటి పాలన కోసం నేటికీ ప్రజలు పరితపిస్తుంటారని అన్నారు. భారతదేశంలోని నేటి రాజకీయ నాయకులు ప్రతి ఓటర్‌ను తమ ఓటు బ్యాంకుగా మార్చుకునేందుకు అన్నదమ్ముళ్లలా.. అన్నాచెల్లెళ్లలా కలిసిమెలిసి ఉంటున్న తమను కులాలు, మతాల పేరుతో విడదీస్తున్నారని అలాంటి కుట్రలకు తాము అవకాశం ఇవ్వమన్నారు. కార్యక్రమంలో హోప్ విన్ హాస్పటల్ మేనేజర్ పి. నాగేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వీల్‌చైర్ బహూకరణ



గుంటూరు మెడికల్: నగరంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి వీల్ చైర్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వీల్ చైర్ బహుకరించడం అభినందనీయమన్నారు. సమితి సభ్యులు ఆసుపత్రికి వస్తున్న రోగులకు సేవలు అందిస్తున్నారని దాంతో పాటుగా వీల్ చైర్ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ ఏం ఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, ఎన్.వి.హనుమంతరావు, కె.సాయి బాబు, విశ్వనాథ్, కె శ్రీధర్, పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో నామినేషన్లకు ఏర్పాట్లు

- 25 వరకు స్వీకరణ
- నిఘా నీడలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్న పోలీసులు



నామినేషన్ల ఘట్టానికి ఏర్పాట్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ ఆఫీసర్ పి. శ్రీకర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎం పద్మజ, నోడల్ ఆఫీసర్ నిసార్‌బాషా, ఎస్ఐ సోమేశ్వరరావుదితరులు

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికలకు నేడు మరో కీలక అడుగు పడనుంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం అధికారులు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. నేటి ఉదయం పదకొండు గంటల నుంచి 25వ తేదీ సాయంత్రం మూడు గంటల వరకు ప్రభుత్వ పనిదినాల్లో నామినేషన్ల ప్రక్రియ జరగనుంది. ఇందుకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాట్లును బుధవారం సంబంధిత శాఖల అధికారులు పూర్తి చేశారు. ఆర్వో శ్రీకర్ బందోబస్తు ఏర్పాట్లు, తీసుకోవలసిన చర్యలను పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

వంద మీటర్ల వరకే అనుమతి..

నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంతో పాటు కార్యాలయ పరిసరాల్లోనూ పోలీసులు నిబంధనలను అమల్లోనికి తీసుకువచ్చారు. తహసీల్దార్ కార్యాలయానికి వంద మీటర్ల పరిధి వరకే వాహనాలను అనుమతించనున్నారు. ఇందుకనుగుణంగా వంద మీటర్ల పరిధిలో స్టాప్ బోర్డులు ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోనికి ప్రజలు చొచ్చుకుని రాకుండా ఉండేందుకు గాను కార్యాలయం చుట్టూ ఫెన్సింగ్, బారికేడ్లును పటిష్టం చేశారు. నాయకుల వాహన శ్రేణిని వంద మీటర్ల పరిధి నుంచి దారి మళ్లించడం జరుగుతుందని, ట్రాఫిక్‌కు ఎలాంటి అవాంతరాలు చోటు చేసుకోకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు..

అత్యంత కీలకమైన నామినేషన్ల ఘట్టం నేటి నుంచి ప్రారంభం కానుండటంతో రెవెన్యూ అధికారులు నిఘా పరంగా కూడా తగు జాగ్రత్తలు తీసుకున్నా రు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం (తహసీల్దార్ కార్యాలయం) మొత్తాన్ని నిఘా నీడలోనికి తీసుకువెళ్లారు. కార్యాలయం బయట, లోపల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి సునిశితంగా కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకున్నారు.



ఆర్‌వో కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన స్టాప్‌బోర్డులు



నామినేషన్ల స్వీకరణకు సిద్ధం చేసిన ఆర్వోచాంబర్

తలనొప్పిగా పార్కింగ్

ఇదిలా ఉంటే పోలీసులకు పార్కింగ్ సమస్య తలనొప్పిగా మారనుంది. ప్రధాన పార్టీలు నిర్వహించే నామినేషన్ ఘట్టంలో భారీ ర్యాలీదే ప్రధాన భూమిక. ర్యాలీలో వందల సంఖ్యలో వాహనాలు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా ముప్పై నుంచి యాభై వేల మంది వరకు జన సందోహం వచ్చేలా ప్రధాన రాజకీయ పార్టీలు సన్నాహాలు చేస్తున్నా యి. ఈ ర్యాలీ అంతా పాత మద్రాసు రోడ్డులోనే వస్తుంది. అంకమ్మగుడి వరకు వాహనాలను అనుమతించి అటు నుంచి పరమేశ్వర స్వామి గుడి వైపు వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నప్పటికీ, వేల మందిలో ఇది సాధ్యమేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక వేళ అంకమ్మ గుడి దాటి వాహనాలు 100 మీటర్ల పరిధి వరకు వస్తే అక్కడి నుంచి వాహనాలను ఎక్కడకు తరలించాలన్న దారిపై పోలీసులు తర్జన భర్జనలు పడుతున్నారు.

ప్రత్యేక డెస్క్‌లు ఏర్పాటు



నామినేషన్ల ప్రక్రియలో నాయకులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆర్వో పి. శ్రీకర్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆర్వో కార్యాలయంలో స్పెషల్ డెస్కులను ఏర్పాటు చేశారు. నామినేషన్ల దాఖలుకు సంబంధించిన సందేహాలు, అనుమానాలు, నామినేషన్ పత్రాలు.. తదితరాల కోసం ప్రత్తిపాడులోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఫారం–12 తీసుకునేందుకు కూడా మరో స్పెషల్ డెస్క్‌ను సిద్ధం చేశారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరామ నవమి



పొన్నూరులో జరిగిన గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు



శలపాడులో జరిగిన సీతారాముల కల్యాణోత్సవం



వడ్లమూడి గరువుపాలెంలో శ్రీరామనవమి వేడుకల్లో స్వామి వారు



శేకూరులో దర్శనమిచ్చిన ఉత్సవ మూర్తులు



చేబ్రోలు మండలం మంచాల గ్రామంలోని రామాలయం వద్ద సీతారాముల కల్యాణోత్సవం



తోట్లపాలెం జగనన్న కాలనీలో జరిగిన సీతారామ కల్యాణోత్సవంలో కాలనీవాసులు

పొన్నూరు: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా బుధవారం పొన్నూరులోని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ అర్చకులు పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారాముల కల్యాణం కమనీయంగా జరిపారు. కల్యాణంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు, వడపప్పు, పానకం స్వీకరించారు. తెలగపాలెంలోని శ్రీ కోదండరామాలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణం అనంతరం గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కనకతప్పెట్లు, కోలాటాలతో ప్రధాన వీధులలో ఉత్సవం సాగింది. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ రామాలయం, నేతాజీనగర్‌లోని రామాలయం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీలు పర్యవేక్షించారు.

చేబ్రోలులో...

చేబ్రోలు: మండలంలో వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణాన్ని కన్నుల పండుగా నిర్వహించారు. భద్రాచలంలో సీతారాముల కల్యాణం మాదరిగా సీతారామస్వామి దేవస్థానంలో పూజకార్యక్రమాలు నిర్వహించారు. వేజండ్ల కోదండ రామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎదురుకోల కన్నుల పండుగగా జరిగింది. శలపాడులోని సీతారామస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణం



పొన్నూరులో కోలాటం చేస్తున్న మహిళలు

ఘనంగా జరిగింది. చేబ్రోలు జీబీసీ రహదారి సమీపంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవంను ఘనంగా నిర్వహించారు. తోట్లపాలెం జగనన్న కాలనీలో శ్రీరామనవమి వేడుకలను కాలనీవాసులు వైభవంగా నిర్వహించారు. మంచాల, శ్రీరంగపురం, నారాకోడూరు తదితర గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా చోట్ల కల్యాణమూర్తుల గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో వెలుగులు నింపాయి.

పెదకాకానిలో....

పెదకాకాని: శ్రీరామ నవమి పర్వదినం శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యలో పట్టాభిషిక్తుడు కావడం, అదేరోజున సీతారాముల కల్యాణం జరగడాన్ని పురస్కరించుకుని దేశమంతటా శ్రీరామనవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నామని అర్చకులు తెలిపారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో వాడవాడలా బుధవారం ఉదయం నుండే శ్రీ సీతారాముల కల్యాణం చూద్దము రారండీ అంటూ భక్తిపరవశమైన పాటలు మార్మోగాయి. ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి శోభాయమానంగా అలంకరించారు. ఆయా గ్రామాలలో ఉన్న రామాలయాల వద్ద, శ్రీరామనవమి వేడుకలు జరుపుకునేందుకు ఏర్పాటు చేసిన పందిళ్లలో శ్రీ సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కల్యాణ క్రతువులో పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజలు జరిపించారు. ఆలయాలు, చలువ పందిళ్లు భక్తులతో కళకళలాడాయి. స్వామివారికి భక్తిశ్రద్ధలతో పొంగలి నైవేద్యాలు సమర్పించారు. నిర్వాహకులు పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ పానకం, వడపప్పు, ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా పలు ఆలయాల వద్ద అన్న సంతర్పణ జరిగింది. ఆలయాలు రాత్రి వేళలలో విద్యుత్ కాంతులతో కళకళలాడాయి.

అలాగే పెదకాకాని పాత ఎమ్మార్వో కార్యాలయం ఏరియాలో బుధవారం రాత్రి శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాలకు పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ హాజరయ్యారు. అనంతరం స్థానిక నాయకులతో కలసి అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంబటి మురళీకృష్ణ పూజలు



నంబూరులో తలంబ్రాలు పోస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పెదకాకాని మండల పరిధిలోని నంబూరు జయభారతరెడ్డి నగర్, వైశ్యాబ్యాంక్ బజారులోని రాములవారి గుడిలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో పొన్నూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పాల్గొని ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని పూజలు జరిపించారు. అర్చకులు గోత్రనామ పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు గుజ్జుల సుమతి, వుయ్యూరు సతీష్‌రెడ్డి, మందాళ శివారెడ్డి, భీమవరపు కృష్ణారెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాములోరి పెళ్లికి అతిథిగా వచ్చిన వానరం

పెదకాకాని: శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలు అర్చకులు శాస్త్రోక్తముగా జరిపించారు. పెదకాకాని సదాశివకాలనీలోని రామాలయం వద్దకు బుధవారం సీత రాముల కల్యాణ వేడుక జరుగుతున్న సమయంలో ఆలయంలోకి వానరం (కోతి) వచ్చి భక్తులను ఆశ్చర్యానికి గురి చేసింది. సదా శివకాలనీలో చోటు చేసుకున్న ఈ సంఘటన భక్తులను ఆనందింపజేసింది. సాంప్రదాయబద్ధంగా వేద మంత్రోచ్చారణ మధ్య కల్యాణం జరిగినంత సేపు అక్కడే ఉండి వీక్షించింది. కల్యాణం పూర్తి అయిన అనంతరం ఆ వానరం సీతమ్మవారి పాదాలు తాగి కేవలం ప్రసాద మాత్రమే తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయింది. పూజా కార్యక్రమాలు సమయంలో భక్తులను ఎటువంటి భయభ్రాంతులకు గురిచేయకపోవడంతో సాక్షాత్తు ఆంజనేయ స్వామి వచ్చి ప్రసాదం స్వీకరించినట్లుగా భక్తులు భావిస్తున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులందరికీ పానకం, వడపప్పు, పులిహోర ప్రసాదంగా పంపిణీ చేశారు.



సీతారాముల కల్యాణం పూర్తయిన వెంటనే వచ్చి ప్రసాదాన్ని స్వీకరిస్తున్న వానర (కోతి)

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం జరగాలంటే జగనన్న ద్వారానే సాధ్యమని నమ్మి ఎందరో ప్రజలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని పత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు 100 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. నగరంలోని జేకేసీ కళాశాల రోడ్డులో వికాస్‌నగర్ నందున్న ఎమ్మెల్యే అభ్యర్థి క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారిని పార్టీ కండువాను కప్పి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి మాట్లాడుతూ చంద్రబాబు, దత్త పుత్రుడిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. జగనన్న ద్వారానే ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని నమ్మిప్రజలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో పత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి అఖండ మెజారిటీతో వైఎస్సార్ సీపీని గెలిపించి జగనన్నకు గిఫ్ట్‌గా ఇద్దామని పిలుపునిచ్చారు. జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. జగనన్న మరోసారి ముఖ్యమంత్రి ఐతేనే సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా ఇంటికే అందుతాయన్నారు. జగనన్న ద్వారానే ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. దేశంలో ఎన్నడూ కనివిని ఎరుగని రీతిలో జగనన్న తల్లికడుపులోని చిన్నారి నుంచి ఆశీర్వదించే అవ్వాతాతల వరకూ సంక్షేమ పథకాలను అందించిన ఏకైక నాయకుడు మన జగనన్న మాత్రమేనని తెలిపారు. చంద్రబాబు మాయ మాటలు నమ్మవద్దని ఎన్నికల కోసం వచ్చి అబద్ధాలు చెప్పేవాడు చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో భాగంగా పార్టీలో చేరిన కార్యకర్తలు జై జగనన్న, జై కిరణన్న అంటూ నినాదాలు చేశారు. రానున్న ఎన్నికల్లో పత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులున్నారు.

టీడీపీ కూటమికి ఓట్లడిగే అర్హత లేదు



25వ వార్డులో ప్రచారం నిర్వహించిన అంబటి మురళీకృష్ణ

- చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మొద్దు
- వైఎస్సార్ సీపీ పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ
- 25,27 వార్డులలో విస్తృత ప్రచారం

పొన్నూరు: నియోజకవర్గంలో పాతికేళ్ల పాలన సాగించి అభివృద్ధిని విస్మరించిన టీడీపీ కూటమికి ఓట్లడిగే నైతిక అర్హతలేదని వైఎస్సార్ సీపీ పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పట్టణంలోని 25, 27 వార్డులలో ప్రచారం నిర్వహించారు. ముస్లిం ప్రాంతాల్లో పర్యటించి ఆప్యాయంగా వారిని పలకరించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాయకులు అంబటి మురళీకృష్ణకు ఘన స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ రామాలయాల్లో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి వీధిలో అంబటికి మహిళలు హారతులిచ్చి విజయతిలకం దిద్దారు. వార్డుల్లోని ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని, తన సొంత డైరీలో రాసుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం వెంటనే సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపడతానని ప్రజలకు హామీ ఇచ్చారు. జగనన్న అమలు చేసిన నవరత్నాల పథకాల లబ్ధిని వివరించారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికలలో ఓట్లకోసం అమలుకు నోచుకోని హామీలిస్తున్న చంద్రబాబు కూటమి చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. గత రెండేళ్లుగా సేవా కార్యక్రమాలతో నియోజకవర్గ ప్రజలకు అండగా నిలిచానని గుర్తు చేశారు. నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా ఉన్న సమస్యలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కారానికి నోచుకున్నాయని వివరించారు. ఎమ్మెల్యేగా తనను గెలిపించి ఒక్క అవకాశం ఇస్తే నిరంతరం ప్రజలకు అండగా ఉంటానని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్రలో ప్రజలకిచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ప్రచారంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్. సైపుల్లా, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు ఎంఏ. మహమూద్, నాయకులు షేక్. మాము, బొనిగల వేణుప్రసాద్, షేక్. నాజర్, వడ్రాణం ప్రసాదు, అమిరినేని సాంబశివరావు, అంబటి వెంకటేశ్వర్లు, ఎందేటి వెంకట సుబ్బయ్య, బోయి నాగరాజు, మొల్ల కరీం, వట్టిప్రోలు రంగారావు, బొద్దులూరి రంగారావు, గేరా సంజీవ్, దేవరకొండ గోపి, ఆకుల రామ్మోహన్, అనీలా కుమారి, మంద్రు అనిత, మూర్తి రాజు, ఫజరుల్లా, షేక్.సుభాని పాల్గొన్నారు.



అంబటి మురళీకృష్ణను గజమాలతో సత్కరిస్తున్న స్థానికులు

గొట్టిపాడు వాసుల ఆగ్రహం



గొట్టిపాడు గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం. పద్మజ

ప్రత్తిపాడు: రెవెన్యూ అధికారుల తీరుపై పెదగొట్టిపాడు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో రక్షిత మంచినీటి చెరువు పూర్తిగా ఎండిపోయిందని, ప్రస్తుతం సాగర్ జలాలను ప్రభుత్వం విడుదల చేసిన నేపథ్యంలో తమ చెరువులను నింపుకునేందుకు కూడా అవకాశం ఇప్పించాలని కోరేందుకు గొట్టిపాడు టీడీపీ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు బుధవారం ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అదే సమయంలో కార్యాలయంలో విధుల్లో ఉన్న ఓ అధికారి తమపట్ల అభ్యంతరకరంగా మాట్లాడాడంటూ గ్రామస్తులు తీవ్రంగా ఆగ్రహించారు. ఏమిటిక్కడ మీ న్యూసెన్స్.. ముందు గొడవ చెయ్యకండి.. బయటకు వెళ్లిపోండంటూ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులను ఆ అధికారి అవమానించారని ఆరోపించారు. ప్రజలంటే ఎందుకంత చులకనంటూ మండిపడ్డారు. ఆయన బయటకు వచ్చి సమాధానం చెప్పే వరకు ఇక్కడి నుండి కదిలేది లేదంటూ తహసీల్దార్ గది బయటే ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో తహసీల్దార్ పద్మజ బయటకు వచ్చి పొరబాటు జరిగిందని, సదరు అధికారి తెలియక మాట్లాడి ఉండవచ్చని, తన తరపున నేను క్షమాపణ కోరుతున్నానని గ్రామస్తులను అడగడంతో వారు శాంతించి వెళ్లిపోయారు.

గ్రూప్–2 మెయిన్స్‌కు 48 మంది ఎంపిక

నెహ్రూనగర్: బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఏపీపీఎస్‌సీ గ్రూప్–2 పరీక్షకు శిక్షణ పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల్లో 48 మంది మెయిన్స్ పరీక్షలకు ఎంపికైనట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 86 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులతోపాటు, గుంటూరు జిల్లాకు చెందిన మరో 50 మంది (ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి వారికి స్పాన్సర్ చేయడం జరిగిందన్నారు. మొత్తంగా 48 మంది గ్రూప్–2 మెయిన్స్‌కు అర్హత సాధించారన్నారు. త్వరలో గ్రూప్–2 మెయిన్స్‌కు కూడా ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు.

దళిత సంఘాల హర్షం

నెహ్రూనగర్: ఎస్సీ ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం శిరోముండనం కేసులో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులను దోషిగా నిర్ధారించి జైలు శిక్ష వేయటం పట్ల దళిత సంఘాలు వర్షం వ్యక్తం చేస్తున్నాయి. భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పగల ప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం లాడ్జి సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు.